
ప్రజాశక్తి
ఆదివారం 4 మే 2025
5
విజయనగరం



బొబ్బిలిలో గాలివాన బీభత్సం

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శనివారం గాలివాన బీభత్సం సృష్టించింది. సంగిడిలో గాలులకు చెట్టు విద్యుత్తు వైర్లపై పడింది. ఆ సమయంలో విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పిందని ప్రజలు చెప్తున్నారు. ఎనిమిదో వార్డు శివాలయం వీధి జయప్రకాశ్ మున్సిపల్ పాఠశాల వద్ద గాలులకు విద్యుత్తు స్తంభం కూలి పక్కనే ఉన్న జియో కేబుల్‌పై ఒరగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గాలులకు మామిడి పంటకు నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు.



విద్యుత్తు తీగలపై పడిన చెట్టు



బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లో ఖాళీగా ఉన్న భూములు

ఎంఎస్ఎంఇ పార్కులకు 280 ఎకరాలు గుర్తింపు

- నియోజకవర్గానికి ఒక చోట ఏర్పాటు
- భూమి అప్పగించాక అభివృద్ధి చేస్తామంటున్న ఎపిఐఐసి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎంఎస్ఎంఇ పార్కులకు జిల్లా వ్యాప్తంగా సుమారు 280 ఎకరాలను అధికార యంత్రాంగం గుర్తించింది. నియోజకవర్గానికి ఒక పార్కు చొప్పున ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు, జిల్లాకు చెందిన ఎంఎస్ఎంఇ (చిన్న, మధ్యతరహా పరిశ్రమలు) శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా పదేపదే చెబుతున్న సంగతి విదితమే. స్వర్ణాంధ్ర విజన్-47లో భాగంగా రానున్న ఐదేళ్లలో జిల్లా 15శాతం వృద్ధిరేటు పెంచనున్నట్లు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇంతకీ పారిశ్రామిక వేత్తను తయారుచేస్తామని కూడా ఇటీవల చెప్పుకొస్తున్నారు. ఇందుకనుగుణంగా వ్యవసాయ, సేవ, పారిశ్రామిక రంగాల్లో ప్రభుత్వం కొన్ని లక్ష్యాలను నిర్దేశించింది. ఇందులో భాగంగా పారిశ్రామిక రంగ అభివృద్ధిలో కోసం ప్రతి నియోజకవర్గంలోనూ ఒక చిన్న, మధ్యతరహా పరిశ్రమల కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పేరుతో విజయనగరం నియోజకవర్గం పరిధిలోని కొండకరకాంలో 12ఎకరాలు, నెల్లిమర్ల నియోజకవర్గం డెంకాడ మండలం మొదవలసలో 19.8ఎకరాలు, గజపతినగరం నియోజకవర్గం బొండపల్లి మండలం కొండకిండాంలో 57ఎకరాలు, రాజాం నియోజకవర్గం రేగిడి ఆమదాలవలస మండలం సంకిలిలో 20ఎకరాలు, బొబ్బిలి నియోజకవర్గం రామభద్రపురం మండలం కొట్టక్కిలో 100ఎకరాలు, చీపురుపల్లి నియోజకవర్గం గరివిడి మండలం కుమరాం రెవెన్యు పరిధిలో 10ఎకరాలు, ఎస్.కోట మండలం బలిఘట్టం పరిధిలో 57ఎకరాల చొప్పున మొత్తం ఏడు నియోజకవర్గాల్లోనూ భూమిని గుర్తించారు. త్వరలోనే భూసేకరణకు నోటిఫికేషన్ కూడా జారీ చేయనునట్టుగా సమాచారం. ఇందులో దాదాపు ప్రభుత్వ భూమే ఎక్కువ ఉందని అధికారులు చెబుతున్నారు. జిరాయితీ, కొంతమేర ప్రభుత్వ భూమిలో పేదల, ఆర్థికంగా వెనుకబడినవారు వివిధ పంటలు కూడా చేసుకుంటున్నారు. వీరికి పరిహారం ప్రభుత్వ ఏమేరకు చెల్లిస్తారోనేవి వేచిచూడాల్సిందే.

భూమి కేటాయింపులపై భిన్న స్వరాలు

ఎంఎస్ఎంఇ పార్కుల పేరిట భూముల కేటాయింపుపై భిన్నమైన స్వరాలు వినిపిస్తున్నాయి. పారిశ్రామికంగా అత్యంత వెనుకబడిన జిల్లా మనది. ఈనేపథ్యంలో పరిశ్రమల స్థాపన కోసం భూములు కేటాయించడంలో తప్పేమీ లేదు. కానీ, ఇప్పటికే ఈ పేర్లతో కేటాయించిన భూమిలో పరిశ్రమలు లేవు. మన జిల్లాలో బొబ్బిలి గ్రోత్ సెంటర్, విజయనగరంలోని విటి అగ్రహారం, నెల్లిమర్ల మండలం సారిపల్లి, కొత్తవలస మండలం కంటకాపల్లిలో పారిశ్రామిక వాడలు ఉన్నాయి. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో పరిశ్రమల ఏర్పాటు కోసం నాటి ఎన్‌టిఆర్ హయాంలో ప్రభుత్వం సుమారు 1150 ఎకరాలను సేకరించి రైతులను నిర్వాసితులుగా మార్చింది. ఇక్కడ 310 పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పినప్పటికీ ఇప్పటివరకు కేవలం 161 పరిశ్రమలు మాత్రమే ఏర్పాటయ్యాయి. వీటిలో ఉపాధి కల్పించే పరిశ్రమలు పదికి మించి లేవు. ఇంజినీరింగ్ వర్క్‌షాపులు, ఇటుకల తయారీ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి.

కంటకాపల్లి, సారిపల్లి పారిశ్రామిక వాడల్లోనూ చాలా వరకు ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. విటి అగ్రహారంలో పూర్తిస్థాయి పరిశ్రమలు ఏర్పాటు చేసినప్పటికీ చాలా వరకు మూతపడ్డాయి. బాక్సైట్ శుద్ధి కర్మాగారం పేరిట ఎస్.కోట మండలం బొడ్డవర గ్రామ రెవెన్యూ పరిధిలో వందలాది ఎకరాల భూమిని సుమారు 15ఏళ్ల క్రితమే ప్రభుత్వం లాగేసుకుంది. అక్కడ కూడా పరిశ్రమ ఏర్పాటు చేయలేదు. ఈనేపథ్యంలో ఈ భూమిని ఎంఎస్ఎంఇ పరిశ్రమలకు ఉపయోగిస్తామని సాక్షాత్తు మంత్రి వర్గ సమావేశంలోనే నిర్ణయం చేసింది. ఇవన్నీ వదిలేసి కొత్తగా భూమి సేకరించాల్సిన అవసరం ఏమొచ్చిందనేది వామపక్షాలు, కొంతమంది మేధావుల వాదన. అవన్నీ పెద్ద పరిశ్రమల కోసం కేటాయించిన భూములని ఇటీవల మన జిల్లాకు చెందిన ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ప్రజాశక్తి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కానీ, ఆయా పారిశ్రామికవాడలు, ఆ పేరుతో తీసుకున్న స్థలాల్లో పెద్ద పరిశ్రమలు కూడా రాలేదు. అందుకు జరిగిన కృషి గానీ, వస్తాయన్న భరోసాగానీ లేదు. దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

గ్రామసభకు తెలియకుండా భూమి కోసం ప్రయత్నిస్తారా?

- అడ్డదారుల్లో ప్రయత్నిస్తే ఖబడ్దార్
- మారిక గిరిజనుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి /వేపాడ

'గ్రామ సభకు తెలియకుండా పవర్ ప్రాజెక్టుకోసం ప్రయత్నిస్తారా? తిరిగి 2013 భూసేకరణ చట్టం ప్రకారం చేస్తున్నామని గిరిజనులను నమ్మ బలుకుతారా? ఖబడ్దార్ జాగ్రత్త...! చట్టాలను ఉల్లంఘించి గిరిజనుల జీవితాలను జలసమాధి చేద్దామనుకుంటే ఊరుకునేదే లేదు' అంటూ సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వేపాడ మండలం మారిక ప్రాంతంలో పవర్ ప్రాజెక్టు కోసం వారం రోజుల క్రితం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిన నేపథ్యంలో శనివారం పాతమారిక, కొత్తమారికతో పాటు చుట్టుపక్కల గ్రామాలను సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాధంతో కలిసి తమ్మినేని పర్యటించారు. ఇక్కడ పవర్ ప్లాంట్ పెట్టి తమను వెళ్లగొడితే తాము బతకలేని పరిస్థితి ఏర్పడుతుందంటూ గిరిజనులు నాయకుల ఎదుట వాపోయారు. అనంతరం పాత మారికలో ఏర్పాటుచేసిన సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ 2013 చట్టం ప్రకారం భూమి సేకరిస్తున్నామంటున్న ప్రభుత్వం దాని ప్రకారం స్థానిక గిరిజనులు, గ్రామ సర్పంచ్‌కి ఎందుకు తెలియజేయలేదని చెప్పాలని డిమాండ్ చేశారు. దీన్నిబట్టి గిరిజనుల అభిప్రాయాలు, సదరకాభాదకాలతో సంబంధం లేకుండా భూమి లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా భావిస్తున్నారని వస్తుందన్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూసుకోకపోతే బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకించినట్లే ఇక్కడి గిరిజనులు మరోసారి పోరాడుతారని, అందుకనుగుణంగా వారికి సిపిఎం ఐక్యం చేస్తుందన్నారు. ఇన్నాళ్లు ప్రభుత్వం విద్య, వైద్యం, రోడ్లు ఇతర సదుపాయాలు కల్పించకపోయినా పోడు వ్యవసాయం, అటవీ ఉత్పత్తులతో జీవితాలను నెట్టుకొచ్చారని, అదనీ కోసం ఇలా కూడా బతక నివ్వకపోతే తప్పకుండా తిరగబడతారని హెచ్చరించారు. గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వెంకన్న మాట్లాడుతూ మారిక గూడేలను, చుట్టూ ఆవరించివున్న కొండను అదానికి కట్టబెట్టేందుకు కేంద్రంలోని ప్రధాని మోడీ, రాష్ట్రంలోని సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ బరితెగించారని, ఇందుకోసం గిరిజనులకు మాయమాటలు చెప్పేందుకు కూడా సిద్ధమయ్యారని వివరించారు. ఇలాంటి మాయ మాటలు చెప్పేందుకు ప్రయత్నించినవారిపై తిరగబడాలని పిలుపునిచ్చారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు మాట్లాడుతూ ఇక్కడ పవర్ ప్లాంట్ పెట్టి నీరు మళ్లిస్తే వేలాది ఎకరాలకు సాగునీటి ఇబ్బందులు తలెత్తుతాయని అందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రాజెక్టులను హామీగా చూపించి, బ్యాంకుల్లో రూ.వందల కోట్లు అప్పులు తీసుకుని ఎగ్గొట్టిన సంఘటనలు అదానీ, అంబానీ, తదితరులకు చెందిన సంస్థలు ఉన్నాయని గుర్తుచేశారు. సిపిఎం నాయకులు చల్లా జగన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కరకవలస సర్పంచి పి.పెంటమ్మ, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ రాకోటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. మారిక గిరిజన గూడేలకు చెందిన గిరిజనులు తరలివచ్చారు.



సమావేశంలో పాల్గొన్న మారిక గూడేలకు చెందిన గిరిజనులు

సంకిలి చక్కెర పరిశ్రమను మూసేయొద్దు

ప్రజాశక్తి-బొబ్బిలి

సంకిలి చక్కెర పరిశ్రమ మూత పడకుండా చూడాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలోని లచ్చయ్యపేట, భీమసింగి చక్కెర పరిశ్రమలు మూతపడడంతో చెరకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో చెరకు సాగు విస్తీర్ణం బాగా తగ్గిందన్నారు. జిల్లాలో ఉన్న సంకిలి చక్కెర పరిశ్రమను కూడా మూసివేసి బీరు కంపెనీ పెట్టాలని యాజమాన్యం చూస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి చక్కెర పరిశ్రమ నడిచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నూతన విమానాశ్రయాలు, ఆయుధ డిపో వల్ల రైతులకు ఉపయోగం లేదన్నారు. దేశానికి తిండి పెడుతున్న రైతులను ఆదుకునేందుకు చక్కెర పరిశ్రమను సక్రమంగా నడిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు రెడ్డి త్రినాథ, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు ఉన్నారు.

సమ్మె జయప్రదానికి నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, 8 గంటల పని, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు మే 20 న దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో విజయనగరం జిల్లా కార్మిక సంఘాల సమన్వయ కమిటీ సమావేశం ఎఐఎఫ్‌టియు నాయకులు బెహరా శంకర్ రావు అధ్యక్షతన ఎల్‌బిజి భవన్‌లో శనివారం జరిగింది. సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మే 4న ఉదయం 10 గంటలకు కెఎల్‌పురంలోని ఎన్‌పిఆర్ శ్రామిక భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్ మోహన్ రావు, కోశాధికారి వి. రాములు, ఐఎఫ్‌టియు నాయకులు కె. అప్పల సూరి పాల్గొన్నారు.

సెలవులో కలెక్టర్ అంబేద్కర్

ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా జెసి సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మే 4 నుంచి వారం రోజులపాటు వ్యక్తిగత సెలవుపై వెళ్లనున్నారు. సెలవు అనంతరం ఆయన మే 12న మళ్లీ జిల్లాకు రానున్నారు. ఈ కాలంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహించనున్నారు.

అమరావతితో భావితరానికి భవిష్యత్తు

- రూ.58వేల కోట్లతో రాష్ట్రాభివృద్ధికి ప్రణాళికలు
- ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అమరావతి నిర్మాణంతో భవితరానికి మంచి భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ఫ్ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి రూ.58వేల కోట్లతో ప్రణాళికలు రూపొందించామని, అందుకు సంబంధించిన విజన్ ప్రణాళికను ప్రధాని మోడీ ఆవిష్కరించారని చెప్పారు. శనివారం మంత్రి తన కాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం విడిపోయి పదేళ్లు అవుతున్నా రాజధానిని అభివృద్ధి చేసుకోలేకపోయామని అన్నారు. అమరావతిలో ఐటి, టెక్ హబ్‌లను అభివృద్ధి చేయడమే కాకుండా రాష్ట్రంలో అన్ని జోన్స్‌లో అభివృద్ధి కోసం విజనరీ డాక్యుమెంట్‌ను చంద్రబాబు రూపొందించారని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ కార్యచరణ రూపొందించారని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో గ్రామీణ, అర్బన్ ప్రాంతాలను ఎంపిక చేసి ఒక ఎంఎస్ఎంఇ పార్కును ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

ఎంపిటిసిపై హత్యాయత్నం!

పోలీసులకు ఫిర్యాదు



ఎస్ఐతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు సుదర్శనరావు, తదితరులు

ప్రజాశక్తి - వంగర

తన కారు అద్దాలు ధ్వంసం చేసి తనపై ఆరుగురు వ్యక్తులు హత్యాయత్నం చేశారంటూ శ్రీహరిపురం ఎంపిటిసి, వైసిపి మండల కన్వీనర్ కరణం సుదర్శన రావు ఈనెల 2న బలిజిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం.. కరణం సుదర్శన రావు తన స్వగ్రామం శ్రీహరిపురం ఆర్ అండ్ ఆర్ కాలనీ నుంచి ఆయన నివాసం ఉంటున్న రాజాం వెళ్లేందుకు డ్రైవర్‌తో పాటు కారులో కింజంగి మీదుగా మన్యం జిల్లా బలిజిపేట మండలం నారన్నాయుడువలస గలవల్లి వైపు శుక్రవారం బయలుదేరారు. గలవల్లి సమీపంలో రోడ్డుకు అడ్డంగా ఎవరో బైక్ పెట్టడంతో కారు వేగాన్ని తగ్గించాడు. ఈ క్రమంలో శ్రీహరిపురం ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన టిడిపి సానుభూతిపరులు ఎంపిటిసి సుదర్శన రావు కారు అద్దాలు ధ్వంసం చేశారు. కారు డ్రైవరు చాకచక్యంగా బైకును తప్పించుకొని వేగం పెంచుతూ గలవల్లి చేరుకోవడంతో ప్రాణాప్రాయం నుండి తప్పించుకున్నామని తనపై హత్యాయత్నం చేశారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న వంగర ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీతో పాటు సుదర్శన రావు వైఎస్ఆర్ సిపి నాయకులు వంగర పోలీస్ స్టేషన్లో శుక్రవారం రాత్రి జరిగిన విషయాన్ని తెలియజేశారు. ఈ ఘటన మన్యం జిల్లా బలిజిపేట మండల పరిధిలో జరగడంతో బలిజిపేట పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ షేక్ శంకర్ సూచించారు. అక్కడ నుండి వారంతా బలిజిపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి దాడితల్లి పండగ

ప్రజాశక్తి-బొబ్బిలి

గొల్లపల్లి దాడితల్లి గ్రామదేవత పండగ ఆదివారం ప్రారంభం కానుంది. ఆదివారం దేశతల్లి అమ్మవారి వారాలు, సోమవారం ఉయ్యాల కంబాల ఉత్సవం, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అనుపోత్సవం నిర్వహించనున్నారు. గొల్లపల్లి, బొబ్బిలితోపాటు 12 గ్రామాల ప్రజలు దాడితల్లి పండుగ అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి పండగకు జనం రానున్నారు పండగకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

సీడాప్ ద్వారా పట్టణంలోని వివేకానంద డిగ్రీ కాలేజీలో ఆదివారం ఉచిత నైపుణ్య శిక్షణ, ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్టు టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ తెలిపారు. ఈ మేళాకు అతిథులుగా ఎమ్‌పి శ్రీభరత్ హాజరవుతారని తెలిపారు. ఆధార్, విద్యార్హత పత్రాలు, పాన్‌కార్డుతో జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 85001 88033, 83285 83467 నంబర్లను సంప్రదించాలని కోరారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలేని ఆయన కోరారు.

రెడ్డి శ్రీరామ్మూర్తికి నివాళి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌బిజి నగర్‌లో శనివారం కామ్రేడ్ రెడ్డి శ్రీరామ్మూర్తి 4 వ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు ముందుగా శ్రీరామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ భారతదేశంలో దోపిడీ లేని సమాజం కోసం కృషి చేయాలని. అందుకు ప్రజా పోరాటాలు చేయడం వల్ల మాత్రమే సాధ్యమని అన్నారు.

శ్రీరామ్మూర్తి తుది శ్వాస వరకు పేదల కోసం పోరాటాన్ని నిర్వహించారని, ఆయన బాటలో పయనించడం మన ముందున్న కర్తవ్యమని అన్నారు. కార్యక్రమంలో ఎం. రమణ, రామలక్ష్మి, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు రెడ్డి శంకరరావు, తదితరులు

జాతీయ ఖోఖో పోటీలకు శివ ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 4 నుండి 6వరకు బీహార్ రాష్ట్రంలోని గయాలో జరగబోయే ఖేలో ఇండియా జాతీయ ఖోఖో పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ ఖోఖో జట్టుకు జిల్లాకు చెందిన ఎం.శివ ఎంపికయ్యాడు. ఈ విద్యార్థి ప్రస్తుతం గవర్నమెంట్ జూనియర్ కాలేజి విజయనగరం లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కస్పా స్కూల్లో గోపాల్ మాస్టర్ వద్ద శిక్షణ పొందుతున్నాడు ఈ విద్యార్థి ఎంపిక పట్ల కాలేజీ ప్రిన్సిపల్, జిల్లా ఖోఖో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పెనుమజ్జ విజయలక్ష్మి, సత్యనారాయణ చైర్మన్ చిన్ననాయుడు అభినందనలు తెలిపారు.

93 మంది అభ్యర్థులకు శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

గిరిజన యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత డిఎస్‌సి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.శ్రీనివాసరావు కోరారు. జిల్లా కేంద్రంలో గిరిజన యువతకు నిర్వహిస్తున్న డిఎస్‌సి కోచింగ్ శిక్షణ కేంద్రాన్ని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రామానందంతో కలసి ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన, సాంఘిక సంక్షేమ అధికారులు ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన శిక్షణ మెటీరియల్‌ను అందజేశారు. జిల్లాలో 93 మంది అభ్యర్థులను ఆన్‌లైన్ ద్వారా ఎంపిక చేసి జిల్లా కేంద్రంలో మూడు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఇందులో 80 మంది ఎస్‌టి యువతీ యువకులు శిక్షణ కోసం చేరినట్లు తెలిపారు. శిక్షణ పొందేవారికి ఉచిత భోజన వసతులు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఏప్రిల్ 8నుంచి శిక్షణ ప్రారంభమయ్యిందని, నాలుగు దశల్లో అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బి.రామానందం మాట్లాడుతూ జిల్లాకు చెందిన 190 మంది ఎస్.సి. అభ్యర్థులకు కూడా ఇదే కేంద్రంలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 164 మంది శిక్షణ కోసం చేరినట్లు చెప్పారు.

గురజాడను విస్మరించడం తెలుగుజాతికే అవమానం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మహాకవి గురజాడ వెంకట అప్పారావును రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం తెలుగు జాతికే అవమానకరం. దీనిపై ఉత్తరాంధ్రాలోని సాహితీలోకం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇదేదో మామూలుగా మర్చిపోయిన విషయం కాదని, పాలకులు ఉద్దేశ పూర్వకంగానే అభ్యుదయ భావాలను, చరిత్ర రాసిన కవులు, సాహితీవేత్తలు, కళాకారులను విస్మరించినట్టుగా భావించాలని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజాకవి గంటేడ గౌరు నాయుడు రాసిన పాడుదమా స్వేచ్ఛాగీతం పాటల పుస్తకాన్ని ఇటీవల జిల్లా పరిషత్ వేదికగా ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి హాజరైన కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, సాహితీ ప్రియులంతా కవి గురజాడను ప్రభుత్వం విస్మరించడాన్నీ తీవ్రంగా తప్పుపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉత్తరాంధ్రతోపాటు ఇతర జిల్లాలకు చెందిన వారు కూడా ఇదే విషయాన్ని చర్చించుకున్నారు.దేశమును ప్రేమించమన్న... మంచి అన్నది పెంచుమన్నా అంటూ మన దేశ స్వతంత్ర పోరాటానికి ముందే దేశభక్తిని ఉప్పొంగించారు గురజాడ. దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్... అని కూడా ఉద్బోధించారు. గురజాడ, గిడుగు, కందుకూరి లేని తెలుగు సంస్కృతి, సాంస్కృతిక పునర్వికాశం లేదంటే అతిశయోక్తి కాదు. అందుకే గురజాడను తెలుగుజాతి తన హృదయానికి హద్దుకుంది.



ఇంతటి గురజాడ పేరును ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన మహనీయుల వర్ధంతులు, జయంతుల జాబితాలో చేర్చలేదు. ఇది ముమ్మాటికీ తెలుగు జాతిని అవమానించినట్లేనని సాహితీలోకం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇంతే కాదు సుమారు ప్రభుత్వం ప్రకటించిన 23 ప్రముఖుల్లో రామాయణం రాసిన మొల్ల మినహా మరే మహిళలకు కూడా స్థానం దక్కలేదు. కూటమి ప్రభుత్వ పెద్దలు ఇటీవల సనాతన ధర్మం అనే కొత్తపల్లవి అందుకోవడం వల్లే ఇలా జరిగిందా? అన్న సందేహాలు కూడా వ్యక్తమౌతున్నాయి. సమాజాన్ని వెనక్కినెడుతున్న బాల్య వివాహాలు, సతీసహగమనం వంటి సామాజిక దురాచారాలను కవి గురజాడ తన కలంతో ప్రశ్నించాడు. ఎల్లలోకమునొక్క ఇళ్లై... వర్ణభేదములెల్ల కళ్లై.... అంటూ కులమతాల పేరిట కుమ్ములాడుకోకుండా అంతా ఒక్కటై ఉండాలనే 150ఏళ్ల క్రితమే బోధించారు.


బహుసా అటువంటి రచనలు నేటి పాలకులకు మింగుడు పడడం లేదోమో. అందుకే గురజాడను మహానుభావుల జాబితాలో చేర్చలేదోమే అంటూ సాహితీలోకం చర్చించుకుంటోంది. పాలకుల సంకుచిత ఆలోచనలను వదిలించేందుకు 'మంచి గతమున కొంచెమోనేయ్... మందగించక ముందుకు నడవోయ్... అని గురజాడ అడుగు జాడ చూపించారు. ఇలా చెప్పుకుంటూ పోతే నేడు మన దేశాన్ని పట్టిపీడిస్తున్న మతోన్మాదం, ఉగ్రవాదం, కులమతాల పట్ల మనం ఎలా మెలగాలో కూడా చాటిచెప్పిన గురజాడను గుర్తించికపోవడం నిజంగా తెలుగు జాతికి అవమానమేనన్న చర్చ ముమ్మరంగానే సాగుతోంది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తన పొరపాట్లను సరిదిద్దుకోవాలని కోరుతున్నారు.

తాగునీటి పంపిణీలో ఇబ్బందులు తలెత్తొద్దు

ఇంజినీరింగ్ సిబ్బందికి కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తాగునీటి పంపిణీ లో ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని ఇంజినీరింగ్ సిబ్బందికి, ఎమినిటీస్ కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశాలతో తాగునీటి పంపిణీ సక్రమంగా జరిగే విధంగా, ఎక్కడా కలుషితం నీరు లేకుండా, లీకులు లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని చెప్పారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజు ఉదయం కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి పంపిణీ జరుగుతున్న సమయంలో నీటి నాణ్యత పరీక్షలను జరిపి నివేదికను సమర్పించాలన్నారు. వీధి దీపాలు సక్రమ నిర్వహణ పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నీటి వృథాను అరికట్టాలని చెప్పారు. సమావేశంలో ఎంఇ టి. రాయిల్ బాబు, డిఇలు శ్రీనివాసరావు, మణికుమార్, ప్రసాదు, ఎఇలు, ఫిట్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

గోతులను పూడ్చేందుకు చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి–బొబ్బిలి

గొల్లపల్లిలో దాడితల్లి గ్రామదేవత పండగ సిరిమానోత్సవం జరిగే ప్రాంతాల్లో రోడ్లపై గోతులను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ రామలక్ష్మి ఆదేశించారు. గొల్లపల్లిలో పండగ ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. గొల్లపల్లి వనంగుడి వద్ద లైట్లు వేయాలని సూచించారు. శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాల ఎదురుగా ఉన్న చెత్తను ఎత్తి శుభ్రం చేయాలన్నారు. పండగకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి–బొబ్బిలి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి కోరారు. పర్యావరణ పరిరక్షణకు స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి గాంధీ బొమ్మ వరకు సైకిల్ ర్యాలీ చేశారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని వారు కోరారు. పచ్చదనంతోనే కాలుష్యాన్ని నివారించగలమని చెప్పారు. వాయు, శబ్ద కాలుష్య నివారణకు వాహన వినియోగాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్ బెల్ట్ సభ్యులు కె.కృష్ణదాసు, శ్రీనివాస్, మల్లేశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు బ్రహ్మాజీ, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సారాతో అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి– నెల్లిమర్ల

నవోదయం 2.0లో భాగంగా స్థానిక ఎక్సైజ్ ఎస్ఐ నాగేశ్వరరావు సిబ్బందితో కలిసి శనివారం అప్పయ్యపేటలో నాటుసారా వల్ల కలిగే అనర్థాలుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎం.అప్పారావు, వి. కృష్ణ, సంతోష్‌కుమార్, కె. సీతాలక్ష్మిలు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి –చీపురుపల్లి

చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఉచిత వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులను వైసిపి జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లన వంశీ కృష్ణ, గడ్డే అనూరాగ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు ఈ నెల రోజులు ఈ క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మంచి ప్రతిభను కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి శ్రీనివాసరావు, పీడీలు స్వరూప్, మురళి, వేణు, శేఖర్, సతీష్, సత్యనారాయణ, అప్పల తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

ప్రజాశక్తి– మెరకముడిదాం

మండలంలోని గర్భాం మేజర్ పంచాయతీలో సర్వే నెంబర్ 311లో గల ప్రభుత్వ ఎర్ర చెరువులో అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఆజాద్‌ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఆదేశాలు మేరకు శనివారం ఎర్ర చెరువు దగ్గర పంచాయతీ కార్యదర్శి ఐ.విశ్వనాధం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ భాష, స్థానిక సర్వేయర్ జాకీరాజ్ పలువురు పాల్గొన్నారు.

పోలీసులకు 'గురుదేవ్' స్టాపర్లు

ప్రజాశక్తి – కొత్తవలస

మంగళపాలెం వద్దనున్న శ్రీగురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్.. కొత్తవలస పోలీసులకు 10 స్టాపర్లు అందజేసింది. వీటిని కొత్తవలస సిఐ షణ్ముఖరావుకు ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు అందజేశారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్న ప్రాంతాలను గుర్తించి, వీటిని ఉపయోగిస్తామని సిఐ తెలిపారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఔదార్యం

ప్రజాశక్తి –వేపాడ

మండలంలోని సింగరాయి సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ లీల మంచిమనసు చాటుకున్నారు. సింగరాయి సచివాలయ పరిధిలోని అరిగిపాలెం గ్రామానికి చెందిన నిమ్మకాయల దుర్గమ్మ అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ సామాజిక పింఛను లబ్ధిదారు. దీంతో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ లీల సొంత డబ్బులతో ఛార్జీలు పెట్టుకుని, శనివారం ఆస్పత్రికి వెళ్లి పింఛను డబ్బులను ఆమెకు అందజేశారు. లీల ఔదార్యాన్ని మెచ్చి, గ్రామస్తులు ఆమెను అభినందించారు.

వైసిపి నాయకులకు శంబంగి పరామర్శ

ప్రజాశక్తి –బాడంగి

మండలంలోని గజరాయుని వలసకు చెందిన ముద్దడ భాస్కరరావు, దొంకినవలసకు చెందిన గండి శంకర్రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం స్వగ్రామానికి వచ్చిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి శనివారం వారి ఇళ్లవద్దకు వెళ్లి పరామర్శించారు. ప్రమాదం జరగడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, వైసిపి నాయకులు యామల శివప్రసాద్, మరిపి శంకర్రావు, ఆవు సత్యనారాయణ, తెర్లి శ్రీనివాసరావు, తెంటు తిరుపతిరావు, రావాడ తిరుపతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల సూచికలు ఏర్పాటు

ప్రజాశక్తి –విజయనగరం టౌన్

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాద సూచికలను నగరంలో వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేస్తున్నట్టు కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ప్రధాన రహదారుల మధ్యలో ఉన్న డివైడర్లకు హజార్డెస్ బోర్డులు, మీడియన్ మార్కర్స్, సోలార్ స్టడ్స్ వంటివి అమర్చుతున్నామని తెలిపారు. ఈ ప్రమాద సూచికలను డిఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఏర్పాటు చేస్తున్నారు. వాహన చోదకులు తప్పనిసరిగా ప్రమాద సూచికలను గమనించి రాకపోకలు సాగించాలని కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు. సూర్యరశ్మితో ఛార్జింగ్ అయిన సోలార్ స్టడ్స్ రాత్రి సమయాలలో వెలుతురునిస్తాయని తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి – భోగాపురం

కిషోర్ బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని పోలిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి దివ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిషోర్ వికాసంపై శనివారం అవగాహన సదస్సును అంగన్వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులతో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారి మాట్లాడుతూ కిషోర్ బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. బాలికలకు వివాహాలు చేయడం వల్ల వారికి పుట్టే పిల్లల్లో ఎదుగుదల ఉండదని తెలిపారు. ఈ సమావేశంలో ఎసి డిపిఒ సత్యవతి, వెలుగు ఎపిఎం జగదీశ్, ఎఒ కామేశ్వరరావు, సూపర్వైజర్లు నాగమణి, శాంతిలత తదితరులు పాల్గొన్నారు.

వార్డు సందర్శనతో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి – నెల్లిమర్ల

వార్డు సందర్శనతో సమస్యలు పరిష్కారమవుతాయని కమిషనర్ ఎ.తారకనాథ్ తెలిపారు. శనివారం ,19,20 వార్డుల్లో చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, అధికారులతో కలిసి పర్యటించారు. రోడ్లు, కాలువలు, మంచినీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్యం తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డుల్లో సమస్యలు గుర్తించి పరిష్కారం చేస్తున్నామన్నారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, సహాయక ఇంజనీర్లు, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్, ప్లానింగ్ కార్యదర్శులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి 20వేలు విరాళం

ప్రజాశక్తి – భోగాపురం

ఆలయ నిర్మాణానికి తన వంతు సాయంగా 20వేలు ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు శనివారం అందజేశారు. మండలంలోని జమ్మయ్యపేట గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బంగార్రాజు ఈ సహాయాన్ని గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొత్తపల్లి రెడ్డి, దాసరి శ్రీను రాజు, చెల్లుబోయిన బాలు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరంతర పోరాటమే శ్రీరామ్మూర్తికి నివాళి

- ప్రాథమిక హక్కులపై మోడీ ప్రభుత్వం దాడులను తిప్పికొట్టాలి
- నాలుగో వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ



శ్రీరామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి – పార్వతీపురం

ప్రజా ఉద్యమాల పట్ల నిరంతరం శ్రమిస్తూనే, కార్మిక, రైతాంగ వర్గానికి వెన్నుదన్నుగా నిలుస్తూ, విశాల ఐక్య ఉద్యమాలకు ఊపిరి పోసిన శ్రీరామ్మూర్తికి ప్రజాసమస్యలపై నిరంత పోరాటాలతోనే నిజమైన నివాళి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ అన్నారు.

సిపిఎం జిల్లా పూర్వ కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి నాలుగో వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక ఎన్జీవో హోంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రామస్వామి అధ్యక్షతన సభ జరిగింది. ముందుగా రెడ్డి శ్రీరామ్మూర్తి చిత్రపటానికి సుబ్బరావమ్మతో పాటు పార్టీ సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, ఎపి ఎపి ఎన్‌జిఒ జిల్లా కన్వీనర్ గంటా కిశోర్ కుమార్ శ్రీరామ్మూర్తి సతీమణి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి శ్రీదేవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి.వెంకటరమణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుబ్బరావమ్మ మాట్లాడుతూ శ్రీరామ్మూర్తి త్యాగమూర్తి అని, తన చదువు అనంతరం ఉద్యోగాన్ని, కుటుంబ స్వప్రయోజనాన్ని పక్కన పెట్టి నిరుద్యోగ సమస్యలపై పోరాడేందుకు డివైఎఫ్ఐ సంఘ నాయకుడుగా సమాజానికి పరిచయమై, నేడు ఒక వ్యవస్థ మొత్తానికి నాయకుడుగా నిలవడం అనేది కొంతమందికే సాధ్యమని, అందులో శ్రీరామ్మూర్తి నిలవడం గొప్ప విషయమని అన్నారు.

దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగంలో పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులపై దాడులు పెరుగుతున్నాయని అన్నారు. గతంలో కాశ్మీర్‌లో పుల్వామా దాడిని ఉపయోగించుకుని బిజెపి రాజకీయ లబ్ధి పొందిందని చెప్పారు. ఇప్పుడు పెహల్గాంలో తీవ్రవాదుల దాడిలో హిందువులే మరణించారని ప్రచారం చేస్తోందన్నారు. దాడులు ఎవరు చేసినా తప్పేనని చెప్పారు. దశాబ్దాల క్రితం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వీటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. క్రిమినల్ చట్టాలను కూడా రద్దు చేసి కొత్త చట్టాలను అమలు చేస్తోందని చెప్పారు. ఈ చట్టాలతో ప్రశ్నించే నాయకుల గొంతు నొక్కాలని ప్రయత్నిస్తోందన్నారు. ఇటువంటి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కష్ణమూర్తి మాట్లాడుతూ నిరంతర పోరాటాలు, ఉద్యమాలు చేసే నాయకుడు రెడ్డి శ్రీరామ్మూర్తి అని అన్నారు. ఆయనంటే ఒక భరోసా, విశ్వాసం వుండేదని చెప్పారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని చెప్పారు. ఏదైనా సమస్యపై పోరాడితే పరిష్కారమయ్యేంత వరకు పని చేసేవారని చెప్పారు. నమ్మిన సిద్ధాంతం కోసం ఆఖరి దాకా పోరాడారని చెప్పారు. ఆయన ఆదర్శాలను అనుసరించడమే ఆయనకు అసలైన నివాళి అని అన్నారు. ఉమ్మడి జిల్లాలో శ్రీరామ్మూర్తి అనేక పోరాటాలకు ఆసరాగా నిలిచారని, శ్రీరామ్మూర్తి ఉద్యమ స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమాలను, కార్యకర్తలను రూపదిద్దాలని కోరారు. నిత్యం ప్రజలతో కలిసి ఉంటూ వారిని చైతన్యపర్చడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు. ఎపి ఎన్‌జిఒ జిల్లా కన్వీనర్ గంటా కిశోర్‌కుమార్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి శ్రీరామ్మూర్తి చూపిన చొరవ మరువలేనిదని చెప్పారు. ఐద్వా నాయకులు, శ్రీరామ్మూర్తి సతీమణి రెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ శ్రీరామ్మూర్తి తన కుటుంబం కన్నా పేదలనే ఎక్కువగా ప్రేమించారని చెప్పారు. కరోనా సమయంలో ఉపాధి కోల్పోయిన పేదల కోసం ఎక్కువగా పరితపించారన్నారు. భౌతికంగా ఆయన మాతో లేకపోయినా ప్రజలందరి గుండెల్లో చిరకాలం నిలిచిన వ్యక్తిగా నేడు ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతి రావు నాయకులు కొల్లి సాంబమూర్తి, పి.రాజశేఖర్, బివి రమణ, మర్రిశ్రీను, బంటుదాసు, పి.సన్యాసిరావు, వై.మన్మధరావు, రెడ్డి లక్ష్మునాయుడు, రెడ్డి ఈశ్వరరావు, కె.సీతారాం, గంటా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'మత్స్యకార భరోసా భిక్ష కాదు.. మా హక్కు'

ప్రజాశక్తి – పూసపాటిరేగ

మత్స్యకార భరోసా ప్రభుత్వం పెట్టే భిక్ష కాదని అది మా హక్కని తెలుసుకోవాలని జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షులు బర్రి చిన్నప్పన్న అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతేడాది భరోసాను పక్కన పెట్టి రెట్టింపు భరోసా ఇస్తున్నాం అంటే ఎలా అన్నారు. మత్స్యకారులపై ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఇదేనా అని ప్రశ్నించారు. గతేడాది భరోసా కూడా రూ.20వేలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. చింతపల్లిలో ఫ్లోటింగ్ జెట్టి (లాండింగ్ సెంటర్)నిధులున్నా పనులు మొదలు పెట్టక పోవడం ఏమిటని అన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంలో మంజూరు చేసిన జెట్టిలు, హార్బర్లు, పోర్టులు, మత్స్య కారుల జీవితాలలో వెలుగులు నింపే పనులు ఎందుకు నిలిపివేశారో కూటమి నాయకులు మత్స్యకారులకు జవాబు చెప్పాలన్నారు. ఆయనతో పాటు సర్పంచ్ బర్రె ముసలి, గ్రామ పెద్దలు గాంధీ ఉన్నారు.

ప్రత్యేక తరగతులు రద్దు చేయాలి : యుటిఎఫ్

విజయనగరం టౌన్ :10వ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు తరగతుల నిర్వహణయిఐ సంబంధించిన ఉత్తర్వులు రద్దు చేయాలని డిఇఒను యుటిఎఫ్ అధ్యక్ష ప్రదాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, నాయకులు రమేష్ చంద్ర పట్నాయక్, తిరుపతి నాయుడు కోరారు. ఈమేరకు ఎడి గౌరీశంకర్‌కు వినతి అందజేశారు. ఈ తరగతులకు విద్యార్థులు సక్రమంగా హాజరు కానందున ఉపాధ్యాయులు నిర్బంధంగా హాజరు కావాలనే ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు.

నిర్వాసితుల భూ సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి – నెల్లిమర్ల



నిర్వాసితులకు సంఘీభావం తెలుపుతున్న సిపిఎం నాయకులు రామారావు

తారకరామతీర్థ ప్రాజెక్టుకు సంబంధించి కోరాడపేట నిర్వాసితుల భూ సమస్యలు పరిష్కరించి మహిళలపై దుర్భాషలాడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన కోరాడపేట భూ నిర్వాసితులను పరామర్శించి పోరాటానికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితుల భూ సమస్యలు పరిష్కరించమని అడిగితే అధికార్లు వారిని దుర్భాషలాడడం సమంజసం కాదన్నారు. ముఖ్యంగా నిర్వాసితులకు న్యాయం చేసిన తరువాత ప్రాజెక్టు పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. కోరాడపేట ప్రాజెక్టు నిర్వాసితులకు ఇంతవరకు పునరావాసం కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కోరాడపేట ప్రాజెక్టు నిర్వాసితుల భూ సమస్య పరిష్కరించి వారి భూమి వారికి అప్పగించి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు బాధిత రైతులు మాట్లాడుతూ భూ సమస్య పరిష్కరించకుండా ప్రాజెక్టు అధికార్లు పనులు చేయడానికి వచ్చారని వాటిని అడ్డుకోవడంతో అధికారులు మహిళలని చూడకుండా దుర్భాషలాడి దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పునరావాసం కల్పిస్తామని ప్రభుత్వం చెప్పి సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు ఇళ్ల స్థలాలు చూపించలేదని అన్నారు. అడిగినందుకు తిరిగి తమపై కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రాజెక్టులో ఇల్లుకోల్పోయి తమకు పునరావాసం లేకపోవడం వల్ల తమ గ్రామానికి చెందిన యువతీ, యువకులకు వివాహం జకరగడం లేదని, ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాధిత రైతులు కోరాడ శ్రీదేవి, కోరాడ అప్పలనాయుడు, కె. రామునాయుడు, రామారావు, బి.సత్యనారాయణ, టి.గోవింద తదితరులు పాలొగొన్నారు.

బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి–శృంగవరపుకోట

పట్టణంలోని నారాయణ కేంబ్రిడ్జ్ పాఠశాలలో వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. క్రీడలు చదువులకు ఎటువంటి ఆటంకమూ కాదని తెలిపారు. క్రీడల వల్ల పిల్లలు ఉత్తేజితులై చదువుల్లో మరింత రాణిస్తారన్నారు. ఈ సందర్భంగా 19 ఏళ్లుగా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న కోచ్ పొట్నూరు శ్రీరాములును అభినందించారు. శిబిరంలో 70 మంది వరకు చేరారని, ఈ సంఖ్య 150కు పెరిగే అవకాశం ఉందని కోచ్ శ్రీరాములు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఇందుకూరి సుబ్బలక్ష్మి, ప్రిన్సిపల్ శివప్రసాద్, ఎజిఎం శ్రీనివాసరావు, ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు ఎస్‌వి.సత్యశేఖర్, స్నేహ స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు అట్లూరి వెంకట్రావు, మంథ సుబ్బారావు, ముంతాజ్ మాల్ వ్యవస్థాపకులు షేక్ ఖాదర్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు మల్లా రామకృష్ణ, డాక్టర్ మల్లా వేణు, ఎ.స్వామినాయుడు పాల్గొన్నారు.



పతివాడను పరామర్శిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

పతివాడకు జెడ్‌పి చైర్మన్ పరామర్శ

ప్రజాశక్తి – పూసపాటిరేగ

మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు సోదరుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మండలంలోని చల్లవానితోటలో పతివాడ స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. నారాయణస్వామి సోదరుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పతివాడ నారాయణస్వామినాయుడు ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు వైసిపి మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, భోగాపురం మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణ, నాయకులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దన్ రావ ఉన్నారు.

రేపటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి–లక్కవరపుకోట

మండలంలో ఈ నెల 5 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ ఎస్.అప్పారావు తెలిపారు. ఈ నెల 5నుంచి ఎనిమిది వరకు పోతంపేట, గొల్జాం, రంగారాయపురం, చందులూరు, లచ్చంపేట, ఎల్‌కెఎఎస్ పురం, లక్కవరపుకోట, మార్లపల్లి, కల్లేపల్లి, కాసాపేట, కితన్నపేట, రేగ, తలారి, రంగారాయపురం, జెడిపేటలో మొదటి విడతగా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 12 నుంచి 15 వరకు తామరపల్లి, కొట్టాడ, గనివాడ, చందులూరు, గంగుబూడి, వీరభద్రపేట, మల్లివీడు, జివిపాలెం, కల్లేపల్లి, గోల్తాం, ఆర్జిపేట, భీమాలి, చందులూరు, రేగ, గోల్జాం, రంగారాయపురం సచివాలయాలలో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేగిడి మండలంలోనూ..

రేగిడి : మండలంలోని 25 సచివాలయాలలో ఏర్పాటు చేస్తున్న ఆధార్ స్పెషల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ శ్యామల కుమారి తెలిపారు. ఈ మేరకు శనివారం తన కార్యాలయంలో ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆరేళ్లలోపు చిన్నారులకు ఈనెల 5 నుంచి 8 వరకు ఆధార్ స్పెషల్ క్యాంపు ఉంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శి ఆధార్ స్పెషల్ డ్రైవ్‌లో ఉన్నందున మహిళా పోలీసులకు బాధ్యతలు అప్పగించామన్నారు. అందుకు చిన్నారులు తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాలకు గ్రామ సచివాలయాల్లో ఇచ్చిన పుట్టిన ధ్రువీకరణ పత్రం, తల్లిదండ్రుల్లో ఒకరిది ఆధార్ తప్పనిసరిగా తీసుకువెళ్లాలని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజల వినియోగించుకోవాలన్నారు.

విద్యార్థికి చేయూత

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలో 425 మార్కులు సాధించిన విద్యార్థినికి ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫీజు నిమిత్తం ' జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూప్' ఆర్థిక సహాయం చేసింది. శనివారం స్థానిక శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో పట్టణానికి చెందిన కాసం భవ్యశ్రీ కు ఇంటర్ కాలేజి ఫీజు నిమిత్తం రూ 33 వేలు చెల్లించినట్లు సంఘం అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ మన గ్రూప్ ద్వారా ఆర్థిక సహాయం పొందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు చెప్పారు. కార్యదర్శి డిమ్స్ రాజు మాట్లాడుతూ విద్య,వైద్యం,వివాహం కార్యక్రమాలకు గ్రూప్ ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో కోశాధికారి సముద్రాల నాగరాజు, పెంటపాటి కామరాజు, మాచర్ల చంద్రశేఖర్ గుప్త, బి.వి.పి.ఎస్.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి

ప్రజాశక్తి–విజయనగరం కోట

విజయనగరంకోట.. మాట్లాడుతున్న ఉపాధ్యాయులు సన్యాసిరావు

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలని ఉపాధ్యాయుడు పి.సన్యాసిరావు తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులతో కథలు చదివించడం, కథలు చెప్పించడం జరిగింది. అనంతరం సన్యాసిరావు మాస్టారు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడమే ఈ శిక్షణ శిబిరాలు ముఖ్య ఉద్దేశమని అన్నారు. అనంతరం మోరల్ ఎడ్యుకేషన్ పై ఎం. చంద్రశేఖర్, గణితంలో మెలకువలు విశిష్టతపై సిహెచ్.కాశీ విశ్వనాథ్ వివరించారు. కార్యక్రమంలో 45మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయ కార్యదర్శి బి. లక్ష్మి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేథమెటిక్స్ కీలకం

చదువు విద్యార్థులకు మేథమేటిక్స్ ఎంతో కీలకమని బి.గోపాల రావు అన్నారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా గాజులరేగ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. గ్రంథాలయాధికారి ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యాన జరుగుతున్న ఈ శిక్షణలో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

డెంకాడ :స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు మహేష్ తెలిపారు. అనంతరం విద్యార్థులకు కథలు పుస్తకాలు చదివించడం, రాయించడం చేశారు. ఈ సందర్భంగా పిల్లలు క్యారమ్ బోర్డ్, స్నేక్ అండ్ లేడర్ ఆటలు ఆడుకున్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు

శృంగవరపుకోట : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా శనివారం సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ ఎంపవర్‌మెంట్ (సి) వ్యవస్థాపకులు బొబ్బిలి రామకృష్ణ విద్యార్థులకు ఆంగ్ల బోధనపై అవగాహన కల్పించారు. జ్ఞానార్జనకు పదాలే మూలమని చెప్పారు. పదాలు ఎక్కువగా నేర్చుకోవడం, వాటికి సంబంధించిన విషయాన్ని తెలుసుకోవడం ద్వారా జ్ఞానం పొందవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు క్యారంబోర్డు, చదరంగం, ఇతర ఆటలు ఆడారు. కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ పాల్గొన్నారు.

కార్మికులకు సమాన వేతనమివ్వాలి

ప్రజాశక్తి–శృంగవరపుకోట

ఆర్టికల్ 39(డి) ప్రకారం పురుషులు, మహిళలు ఇద్దరికీ సమాన పనికి సమాన వేతనం అందజేయాలని దేశ కార్మిక చట్టం చెబుతోందని జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి తెలిపారు. 14 ఏళ్లకంటే తక్కువ వయస్సు ఉన్న బాలలను పనిలో పెట్టకూడదని చెప్పారు. ఎస్.కోట మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.సూరిదేముడు అధ్యక్షతన అసంఘటిత రంగ కార్మికులకు శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ కార్మికులు సాధికారతను ప్రోత్సహించడం, ఉపాధికి సంబంధించిన పనుల్లో సమాన భాగస్వాములుగా వారి హక్కులను కాపాడాలని కార్మిక చట్టం చూస్తుందని తెలిపారు. పని పరిస్థితులు, వేతనాలు, ఆరోగ్యం, భద్రతా ప్రమాణాలు చట్టంలో ఉద్దేశించబడ్డాయని వెల్లడించారు. ఇక అసంఘటిత కార్మికులు, మహిళలు ఏదైనా ఉచిత న్యాయ సహాయం నిమిత్తం కోర్టు ప్రాంగణంలో ఉన్న మండల న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అటువంటి వారికి వెంటనే ఉచిత న్యాయ సహాయం కోసం ప్రత్యేకంగా న్యాయవాదిని కూడా కోర్టు ఏర్పాటు చేస్తుందని హామీ ఇచ్చారు. త్వరలో కార్మిక శాఖ అధికారిని రప్పించి, అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డులను అందజేసే ప్రక్రియ చేపట్టనున్నామని వివరించారు. తద్వారా కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే బీమా, ఇతర సంక్షేమ పథకాలు సజావుగా అందుతాయని వెల్లడించారు. సదస్సులో బార్ అసోసియేషన్ కార్యదర్శి బివిఎస్ రామారావు, సీనియర్ న్యాయ వాదులు బి.సత్యనారాయణ, బి.త్రిమూర్తులు, వారాది ఈశ్వరరావు, డబ్ల్యు.ఎన్.శర్మ, టివిఆర్ మూర్తి, బొబ్బిలి రామకృష్ణ, బొడ్డు వెంకటరావు, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎటిఎల్ బూట్ క్యాంప్ సందర్శన

ప్రజాశక్తి–శృంగవరపుకోట



బూట్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న డిఇఒ మాణిక్యంనాయుడు

ఎస్.కోట మండలంలోని ధర్మవరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎటిఎల్ సమ్మర్ బూట్ క్యాంపును శనివారం డిఇఒ యు.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ బి.ప్రసాద్‌రావు, జిల్లా సైన్స్ అధికారి టి.రాజేష్ పరిశీలించారు. మొదటిరోజు పేపర్ ట్రోనిక్స్ , బేసిక్ ఎలక్ట్రానిక్స్ వర్కింగ్, రెండవ రోజు రోబోటిక్స్‌లో భాగంగా లైన్ ఫాలోయింగ్ రోబోట్ , ఎడ్జ్ అవాయిడర్ రోబోట్‌లను ఆర్డినోకోడింగ్, ఐ ఆర్ సెన్సార్ లను ఉపయోగించి తయారు చేసినట్టు విద్యార్థులు వివరించారు. షెడ్యూల్ ప్రకారం మూడోరోజు పిక్టో బ్లాక్ కోడింగ్ ను ఉపయోగించి కంప్యూటర్ గేమ్ డెవలప్మెంట్ చేస్తున్న విద్యార్థులను అభినందించారు.

జానపద కళలను ఆదరించాలి

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

అంతరించిపోతున్న జానపద కళలను ఆదరించాలని గిడుగు రామమూర్తి తెలుగు భాష, జానపద కళా పీఠం అధ్యక్షులు బద్రి కూర్మా రావు కోరారు. కోట ప్రాంగణంలో ఉత్తరాంధ్ర నవ చైతన్య నాట్య కళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కళాకారుల కార్యవర్గ సమావేశం కార్యదర్శి ఎస్ చిన్న రెడ్డి ఆధ్వర్యంలో శనివారం జరిగింది. వక్తలు మాట్లాడుతూ రాబోయే కాలంలో ప్రభుత్వాలు, దేవాదాయ ధర్మాదాయ శాఖ, సాంస్కృతిక శాఖ అంతరించిపోతున్న జానపద కళల ను ఆదరించాలని ప్రజలు కూడా వీటిని ఆదరించి మన సంస్కృతిని మూడు కాలాలపాటు కాపాడాలని కోరారు . 50 ఏళ్లు దాటిన కళాకారులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. ఉత్తరాంధ్రలోని అతి వేగంగా అంతరించి పోనున్న తూర్పు భాగవతం, రుంజ వాయిద్యం, జముకుల పాట, తప్పెటగుళ్ళు, బుడగ జంగాల పాటలు, దాసర్ల పాటలు, చెక్కభజనలు, సాము గారడీలు, పులి వేషాలు వంటి కళల ను ఆదరించి భావితరాలకు అందించాలని కోరారు. సమావేశంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల జముకుల పాట , చెక్కభజన ,సాము గరిడి, పులి వేషాలు, కోలాటం బంద గురువులైన అట్టాడ లక్ష్మీనాయుడు, మత్స తవిటి నాయుడు, మక్కువ మారినాయుడు ,సింహాచలం, మిరియాల జగన్, పోలిరాజు పొడుపు రెడ్డి శంకర్రావు, బొట్ట తౌడు, పి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యలు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

జనసేన నాయకులు గురాన అయ్యలు జన్మదిన వేడుకలను జనసేన నాయకులు, అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెలుగు ఆశ్రమం, నిరాశ్రయుల వసతి గృహం, చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది లెర్నింగ్ డిసేబుల్డ్ హోంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. కోరుకొండ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం 5000 విరాళం అందజేశారు. అనంతరం జిఎస్ఆర్ హోటల్‌లో అభిమానుల సమక్షంలో క్‌ను కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలతో అయ్యలుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మీడియాతో మాట్లాడుతూ తన జన్మదినం రోజున అభిమానులు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

నాపై ఆధిపత్యం చెలాయిస్తున్నారు..

నగర పంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని

ప్రజాశక్తి – నెల్లిమర్ల

కూటమి పార్టీకి చెందిన ఓ నాయకుడు తనపై ఆదిపత్యం చెలాయిస్తున్నారని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక బైరెడ్డి సూర్యనారాయణ కల్యాణ మండపంలో జనసేన ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నాలుగేళ్ళ పాటు వైసిపి ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన ఒక నాయకుడు పాలనా విషయాల్లో తలదూర్చి, తనను పూర్తిగా నియంత్రించారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను జనసేన పార్టీలోకి మారిన తర్వాత కూటమి పార్టీకి చెందిన ఇంకో వ్యక్తి తనపై ఆధిపత్యం చెలాయి స్తున్నారని చెప్పారు. కౌన్సిల్ సమావేశాల్లో ప్రవేశపెట్టే అంశాలను సభ్యుల సూచన మేరకే తాను ఆమోదిస్తానని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు. తాజాగా జరిగిన సమావేశంలో ప్రవేశపెట్టిన కల్యాణ మండపం విస్తరణ, పార్కు ప్రహరీ నిర్మాణం అంశాలను మెజారిటీ సభ్యులు వ్యతిరేకించారు కాబట్టి తాను తిరస్కరించినట్లు వివరించారు. వైసిపి, టిడిపి సభ్యులు కలిసి తనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతారని ఇటీవల జోరుగా ప్రచారం జరుగుతోందని, కూటమి ప్రభుత్వంలోని తనపై కూటమిలోని వేరేపార్టీ ఎలాఅవిశ్వాసం పెడుతుందని సరోజిని ప్రశ్నించారు. పలు విషయాల్లో కమిషనర్‌తో తాను కుమ్మక్కయ్యానన్న ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. జనసేన నాయకులు అప్పికొండ రవికుమార్, రవ్వా నాని, పాండ్రంకి సత్యనారాయణ మాట్లాడుతూ చైర్ పర్సన్‌కు సంబంధించి ఏవైనా లోపాలుంటే టిడిపి నాయకులు జనసేన పార్టీ దృష్టికి తీసుకురావాలని, కౌన్సిల్ సమావేశాల్లో ఎలా ప్రస్తావిస్తారని ప్రశ్నించారు. సమావేశంలో జనసేన నాయకులు మజ్జి రాంబాబు, బంగారు భాను ప్రకాష్, బంగారు శంకరరావు, పలిశెట్టి దొరబాబు, సారిపల్లి శంకరరావు పాల్గొన్నారు.